బీజేపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గోల్కొండ సరహరితో పాటు జంగం గణేశ్, ఖాసిం, బాకుల హరి, లింగాల జేష్ కుమార్, చేవెళ్ల రాజేశ్, బోడ శ్రావణ్ తదితరులు సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భవనం పై నుంచి పడి మేస్త్రీ మృతి


జోగారావు(ఫైల్)

గచ్చిబౌలి: నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ మేస్త్రీ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన ప్రకారం .. శ్రీకాకుళం జిల్లా, సర్వతోట మండలం, హర్లీ గ్రామానికి చెందిన టి.జోగారావు(35) బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. మూసాపేట్‌లో నివాసం ఉంటూ గౌలిదొడ్డిలోని కేశవ్‌నగర్‌లో రాజారావు అనే కాంట్రాక్టర్ వద్ద మేస్త్రీగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో నాల్గవ అంతస్తులో పని చేస్తూ జారి లిఫ్ట్ గుంతలో పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై జోగారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ కట్‌కట!

సరఫరాలో తరచూ అంతరాయం
అసలే వేసవి.. ఆపై ఉక్కపోత
తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు
పట్టించుకోని విద్యుత్ యంత్రాంగం


కిష్మత్‌పూర్‌లో 150 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది


ఓంనగర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది


తెగిపడ్డ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం తీవ్రంగా ఉంటోంది. ముఖ్యంగా రాత్రి సమయంలో గంటల తరబడి సరఫరా నిలిచిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి.. ఆపై ఉక్కపోత.. దీనికితోడూ ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు పనిచేయకపోవడంతో ప్రజల బాధల వర్ణనతీతంగా మారాయి. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని పై అధికారులు ఆదేశించినా ఇక్కడ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని జనాలు ఆరోపిస్తున్నారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ సమస్య తారస్థాయికి చేరింది. ఓ వైపు అస్తవ్యస్తంగా సరఫరా.. మరోవైపు కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయి. ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్లకు ఉపకేంద్రాల నుంచి వచ్చే 11 కేవీఏ తీగలు తెగిపోతున్నాయి. గత వారం రోజుల్లో ఆదర్శనగర్ కాలనీ, సాధన్ కాలేజ్ సమీపంలోని ప్రధాన జాతీయ రహదారిపై రాత్రి సమయంలో తీగలు తెగిపోయి రోడ్డుపైనే పడిపోయాయి.

78 వేలకు పైగా గృహ, ఇతర కనెక్షన్లు..

కార్పొరేషన్ పరిధిలో పీరంచెరువు, కిస్మత్‌పూర్, హిమాయత్ సాగర్, టీఎస్ పోలీస్ అకాడమీ ప్రాంతాల్లో 33/11 కేవీఏ విద్యుత్ ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఇద్దరు ఏఈలు ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా మాత్రం మెరుగుపడడం లేదు. వీటి పరిధిలో 78 వేలకు పైగా గృహ, ఇతర విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. స్థానికుల సమస్యలను కూడా పట్టించుకునే వారే లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తరచూ అంతరాయం..

వేసవిలో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా చేయడం లేదు. ఆయా ఫీడర్ల పరిధిలో జంక్షన్లను మరమ్మతులు చేయకపోవడంతో తరచూ విద్యుత్ అంతరాయం కలుగడంతో వినియోగదారులు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లోవోల్టేజీ హెచ్చుతగ్గుల కారణంగా ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, టీవీలు, ఇతర ఉపకరణాలు పాడైపోతున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో విద్యుత్ వినియోగం దాదాపుగా రెట్టింపు అవుతుంది. గతంలో ఎదురైనా సమస్యలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతోనే సమస్య జఠిలమవుతుందని వినియోగదారులు వాపోతున్నారు.

విస్తరిస్తున్న నగరం..

ఈ ప్రాంతం నగరానికి అంతర్భాగంగా మారడంతో నివాస గృహాలు విస్తరిస్తున్నాయి. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, షాపింగ్‌మాల్స్ ఏర్పాటవుతున్నాయి. మరిన్ని వచ్చే అవకాశం లేకపోలేదు.అయినా నియంత్రికల సామర్థ్యాన్ని మాత్రం పెంచడం లేదు. కొన్ని రోజుల్లో మూడు చోట్ల 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చి 150 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. వేసవి కావడంతో చాలా మంది జనాలు తమ ఇండ్లలో ఏసీలు, కూలర్లను వినియోగించడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై ఎక్కువ భారం పడి కొన్ని చోట్ల మంటలు వచ్చి కాలిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం నిత్యకృత్యంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శంషాబాద్ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

మాజీమంత్రి కేటీఆర్ కార్నర్ మీటింగ్‌కు భారీగా తరలివచ్చిన జనం


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

శంషాబాద్: పట్టణంలో సోమవారం రాత్రి జరిగిన మాజీ మంత్రి కేటీఆర్ కార్నర్ మీటింగ్‌కు వేలాది మంది ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో కేటీఆర్ ఆద్యంతం హుషారుగా ప్రసంగించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే చేవెళ్ల ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు డి. వెంకటేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు ఆర్. గణేశ్‌గుప్తాతో పాటు స్థానిక కౌన్సిలర్లు, ఎంపీటీసీ, మాజీ సర్పంచ్‌లు, ఎంపీపీ, జడ్పీటీసీ సీరియస్‌గా తీసుకుని జనసమీకరణకు కృషి చేశారు. మీటింగ్ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది.

చేవెళ్లలో కాసానిని గెలిపించాలి


మంచిరేవులలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ, పార్టీ సమన్వయకర్త తలారి మల్లేశ్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి మంచిరేవుల, నార్సింగి, మణికొండలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, అంతకుముందు వచ్చే రైతుబంధు, ముఖ్యమంత్రి సహాయ నిధి సైతం రావడం లేదన్నారు. విద్యుత్ కోతలు, నీటి సమస్యలు మళ్లీ మొదలయ్యాయని, అలాంటి పార్టీతో ఎలాంటి అభివృద్ధి జరగదన్నారు. అలాగే బీజేపీతో ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన ఒక్క ప్రాజెక్టు కూడా లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బి.శ్రీరాములు, రూపారెడ్డి, రాజ్‌కుమార్, లక్ష్మీశ్రీ, సరోజిని, బషీర్, బాబురావు, వసంతరావు, నీలేశ్‌ప్రసాద్, శివగంగ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగం చేసిన కాంగ్రెస్

- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- బీఎంఎస్ ఆత్మీయ సమ్మేళంలో డ్రైవర్లతో భేటీ


రవాణా కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు లక్షలాది మంది ఆటో డ్రైవర్ల బతుకును ఆగం చేసి వారి జీవితాలను రోడ్డున పడేసి పట్టించుకోవడం లేదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎన్నార్ గార్డెన్‌లో భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రవాణా కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉచిత బస్సు కారణంగా ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లకు జీవన భృతి కల్పిస్తామని కల్లిబొల్లి మాటలు చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఆటో డ్రైవర్లకు ముద్ర రుణాలతో పాటు రైతులకు అందుతున్న ఫసల్ బీమా లాంటి కొత్త పథకాలను అందించేందుకు బీజేపీ సర్కారు సిద్ధంగా ఉందన్నారు. తాను ఎంపీగా గెలిస్తే రవాణా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సరైన మార్గం కల్పిస్తానన్నారు. అలాగే ప్రధాని ఆవాస్ యోజన పథకం ద్వారా ఇండ్లు నిర్మించి అందించేందుకు కూడా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి దాణా, కోడిగుడ్ల కుంభకోణం చేశారనే ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. రవాణా కార్మికుల సంక్షేమానికి భరోసా ఇవ్వాలని ఈ సందర్భంగా బీఎంఎస్ ప్రైవేట్ ట్యాక్సీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ కోరారు. కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్, సయ్యద్, హబీబ్, పెంటయ్యగౌడ్, వీరస్వామి, జంగయ్య, రవికుమార్, శ్రీశైలం, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మందకృష్ణ మాదిగ బహిరంగ సభ


బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ మైదానంలో ఈ నెల 7న (నేడు) ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. సభా ఏర్పాట్లను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అలాగే బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మార్పీస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.బాబురావు, డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు తొండుపల్లి మల్లేశ్, ప్రధాన కార్యదర్శి ఇద్దేప్ వేణుగోపాల్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ రావుగల్ల బాబు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెంటనోల్ల నర్సింహ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంఎస్‌పీ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు క్యాసరం శంకర్ రావు మాదిగ, ఎం.రత్నం, ఆర్.ఎస్.రమేశ్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు చిట్టిబాబు, జగన్, గణేశ్, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తూరు రమేశ్, కో–ఇన్‌చార్జి దప్పు నర్సింహ, యదవరావు, గడ్డం శామ్యూల్, కె.ప్రేమ్ కుమార్, రాజేశ్, సుధాకర్, ఎంఎస్‌ఎఫ్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు నేను గ్యారంటీ

చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి


మణికొండలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మణికొండ: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుకు నేనే గ్యారంటీ అని చేవెళ్ల ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ నుంచి మణికొండ మర్రిచెట్టు వరకు భారీ బైక్ ర్యాలీ తీసి అనంతరం మర్రిచెట్టు కూడలి వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పథకాల అమలు నిలిచిపోయాయని జూన్ 5వ తేదీ నుంచి అవి అమలు అవుతాయన్నారు. లేకుంటే రాజేంద్రనగర్ పార్టీ ఇన్‌చార్జి నరేందర్‌ముదిరాజ్ ఇంటికి వెళ్లి తీసుకోవాలని, లేదంటే తన ఇంటికి రావాలన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, పార్టీ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్, మణికొండ అధ్యక్షుడు జితేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే..


వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి


తాండ్ర రవీంద్ర (ఫైల్)

- భర్తను హత్య చేయించిన భార్య
- వీడిన మక్తమదారంలో కాలిన మృతదేహం మిస్టరీ
- ముగ్గురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: కడ్తాల్‌లోని మక్తమదారంలో కాలిన మృతదేహం కేసు మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భార్యనే తన ప్రియుడితో కలిసి భర్త హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధారించి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. గత నెల 30 కడ్తాల్ సమీపంలోని మక్తమదారం బటర్‌ఫ్లై వెంచర్‌లో పూర్తిగా కాలి ఉన్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కడ్తాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ సమీపంలో అదే సమయంలో అదృశ్యం కేసు నమోదు కాగా దాని ఆధారంగా పోలీసులు మృతిచెందిన వ్యక్తి నాదర్‌గుల్ బాలాపూర్‌కు చెందిన తాండ్రా రవీంద్ర (45) సెంట్రింగ్ వర్కర్‌గా గుర్తించారు. రవీంద్ర భార్య గీత (31) బాలాపూర్‌లో నివాసముంటున్న డీసీఎం డ్రైవర్ కడారి యాదగిరితో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని గీత తన ప్రియుడి యాదగిరి కలిసి హత్యకు పథకం వేశారు.

కిడ్నాప్ చేసి..

ఈ నెల 29 సాయంత్రం మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విశాల్ మార్ట్ వద్ద తన భర్త రవీంద్ర ఉన్న సమాచారాన్ని గీత తన ప్రియుడు యాదగిరికి చెప్పింది. దీంతో అతడు బలెనో కారులో తన స్నేహితుడు చిత్రం అనిల్‌కుమార్ (31) కలిసి అక్కడకి వచ్చి బలవంతంగా రవీంద్రను కారులో ఎక్కించుకుని వెళ్లారు. కారులోనే అతడిని విల్‌పానా ఇతర పరికరాలతో విచక్షణ రహితంగా కొట్టారు. మక్తమాదారం బటర్‌ఫ్లై వెంచర్‌కు చేరుకున్న తర్వాత వాటిర్‌బాటిల్‌లో తెచ్చిన పెట్రోలు పోసి నిప్పంటించారు. మంటలకు తాళలేక అతడు సమీపంలోనే కుప్పకూలి చనిపోయాడు. అదే రోజు రాత్రి గీత తన భర్త రవీంద్ర అన్నయ్య రఘునందన్‌కు ఫోన్ చేసి చెప్పింది. మరుసటి రోజు సాయంత్రం వరకు ఫిర్యాదు చేయకపోవడంతో ఆమెను వెంటబెట్టుకుని రఘునందన్ మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసుతో పాటు ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్న పోలీసులు వారి నుంచి కారుతో పాటు హత్యకు ఉపయోగించిన పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో అదనపు డీసీపీ రాంకుమార్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, కడ్తాల్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ ఉన్నారు. కేసును చేధించిన కడ్తాల్, ఆమన్‌గల్, షాద్‌నగర్ పోలీసులను డీసీపీ అభినందించడంతో పాటు రివార్డును అందజేశారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి


అత్తాపూర్‌లో ప్రచారం చేస్తున్న మంగళారం గోవర్ధన్ రెడ్డి

అత్తాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని భ్యాగనగర్ కాలనీ, వీకర్ సెక్షన్ అర్జున్‌వాడ బస్తీ, పాండల బస్తీలో రంజిత్ రెడ్డికి మద్దతుగా సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ.. కరపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిత్యం అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పని చేసే గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, రవీందర్, సుధాకర్ రెడ్డి, మహేందర్, హరి, నాగరాజు, రమేశ్, సురేశ్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవి, పీఎంరెడ్డి, సంతోష్‌గుప్తా, మధు, భాస్కర్, సతీశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో..

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి మద్దతుగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంగళారం గోవర్ధన్ రెడ్డి సోమవారం అత్తాపూర్‌లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల వారు ఇక్కడ జీవనం సాగిస్తున్నారని వారి నుంచి కూడా కాంగ్రెస్‌కి సానుకూలత వ్యక్తమవుతున్నదని చెప్పారు. తమ అభ్యర్థి విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమం అభివృద్ధి

మణికొండ: కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి జరిగిందని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. జితేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని వీకెర్‌సెక్షన్ కాలనీలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో ప్రధానమైనవి ఇప్పటికే అమలవుతున్నాయని, మిగితావి పార్లమెంట్ ఎన్నికల కోడ్ పూర్తి కాగానే అమలు చేస్తామని తెలిపారు. అలాగే కేంద్రంలో అధికారంలోకి రాగానే పాంచ్ న్యాయ్ పథకాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పురుషోత్తం, నాయకుల ముత్యాలు, యాలాల నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, కస్తూరి సతీశ్, ఇందిర, శ్రీనివాస చారి, షేక్ హాజీ, ప్రభావతి, శివానందరెడ్డి, శివారెడ్డి, మహేందర్‌రెడ్డి, విశాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శివరాంపల్లిలో రంజిత్ రెడ్డి రోడ్ షో

రాజేంద్రనగర్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి శివరాంపల్లిలో సోమవారం రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, బాలరాజు, మహేశ్, రాఘవేందర్ రెడ్డి, సతీశ్, చంద్రశేఖర్, అర్జున్, శ్రీనివాస్, బబ్లూ పాల్గొన్నారు.

బుద్వేల్ గ్రామంలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ గ్రామంలోని ఎల్‌బీ శాస్త్రికాలనీ, టీచర్స్ కాలనీ, కిష్టమ్మ గుట్ట, వీకర్ సెక్షన్ కాలనీల్లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోరని బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల నమూనా బ్యాలెట్‌ను చూపుతూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, బుద్వేల్ గ్రామ అధ్యక్షుడు కోరని శ్యామ్, కె.నరేందర్, పి.శ్రీధర్, సి.హెచ్.అమర్‌నాథ్, ఈగ కృష్ణ, నాగరాజు, టి.అనంత, కోరని సదానంద్, కోరని కుమార్, మంద హరికుమార్ పాల్గొన్నారు.


మణికొండ క్వార్టర్స్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రోడ్ షోలో పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి

ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి



ఫెబల్‌సిటీలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: లోక్‌సభ ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర కోరారు. పార్లమెంట్ ఎలక్షన్–2024 స్వీప్ కార్యక్రమంలో భాగంగా 'ఐ ఓటు ఫర్ ష్యూర్ అనే' థీమ్‌తో బండ్లగూడ పెబల్‌సిటీలో సీనియర్ సిటిజన్స్‌కు సోమవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీలోని ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అసోసియేషన్ సభ్యులు కృషి చేయాలన్నారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వసంత్‌రావు, సీనియర్ సిటిజన్స్ శంబుప్రసాద్, మదన్‌చౌదరి, రాజేంద్రకుమార్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మందికి స్క్రీనింగ్, వ్యాక్సినేషన్

గోల్కొండ: ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో హజ్ యాత్రకు ఎంపికైన వారికి స్క్రీనింగ్ టెస్టులు చేస్తూ వ్యాక్సిన్లు వేస్తున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. ఆఖరి విడత బృందంలో హజ్ యాత్రకు వెళ్లే వారికి సోమవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్క్రీనింగ్ చేసి వారికి టీకాలు వేశారు.